క్లుప్తంగా

పరామర్శ



కమాండో గోవింద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పర్ల గ్రామానికి చెందిన ఇండియన్ నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్ కోల్‌కత్తాలో ఈనెల 5న పారా గ్లెడ్డింగ్ శిక్షణలో జరిగిన ప్రమా దంలో మృతి చెందారు. పర్లలోని ఆయన కుటుంబాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. గోవింద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. చీపురుపల్లి,గరివిడి మండల నాయకులు ఇప్పిలి అనంతం, దన్నాన జనార్దన్, మంత్రి రమణమూర్తి, పాండ్రంకి రామలక్ష్మణ్, మీసాల విశ్వేశ్వరరావు, పొన్నాడ కుమార్,గుడివాడ శ్రీరాములునాయుడు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

జామి: వైశాఖమాసం అక్షయ తృతీయ సందర్భంగా మండలంలోని భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు వరప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.


బాధిత కుటుంబానికి సహాయం



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసర సరకులు అందచేస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో శనివారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇమంది సింహాచలంకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆకుటుంబాన్ని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి పరామర్శించారు. నిత్యావసర సరుకులు, వెయ్యి రూపాయల నగదు అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన సాయం గురించి అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ ఆదినారాయణ, వీఆర్‌ఓ అసిరివాడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాల్తేరు వీరయ్య శతదినోత్సవం



థియేటర్ యజమానికి జ్ఞాపిక అందజేస్తున్న చిరంజీవి ఫ్యాన్సీ అధ్యక్షుడు స్వామి నాయుడు, రచయిత సత్యానంద్

చీపురుపల్లి: పట్టణంలోని వంశీ సినిమా థియేటర్‌లో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్తేరు వీరయ్య సినిమా శతదినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు స్వామినాయుడు, కథా రచయిత సత్యానంద్ అతిథులుగా హాజరయ్యారు. థియేటర్ యజమాని మాధవవర్మకు జ్ఞాపిక అందజేసారు. చీపురుపల్లి చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కింతలి మధు, కందుల కృష్ణ పాల్గొన్నారు.

108లో ప్రసవం



తల్లి,బిడ్డకు సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

బొండపల్లి: మండలంలోని శివుడుపాలెం గ్రామానికి చెందిన డి.ఆదమ్మ(21) శనివారం ఉదయం 108 వాహనంలో ప్రసవించారు. ఆదమ్మకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108లో విజయగనరంలోని ఘోషా స్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి,బిడ్డను దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని, ఇరువురూ క్షేమంగానే ఉన్నారని 108 ఈఎంటీ కె.కుమారి, పైలెట్ జి.గురుమూర్తి తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

రంజాన్ వేడుకలను శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు కొత్తదుస్తులు ధరించి ఈద్‌గాలకు చేరుకుని సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు పవిత్ర ఖురాన్‌లోని దివ్య సందేశాన్ని వినిపించారు. సమస్త మానవాళికి సుఖసంతోషాలు కలగాలని, సమస్యలు తొలగిపోవాలని, కుటుంబ జీవనం సాఫీగా సాగిపోవాలని, ప్రపంచ శాంతి కలగాలని అల్లాకు ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రమజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎస్.కోట పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో ని ఈద్‌గాలో నిర్వహించిన వేడుకలుకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు. మతగురువు ఖాసింరిజ్వీ నేతృత్వంలో ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం మతపెద్దలు, ఎమ్మెల్యేను సన్మానించారు. ఎస్.కోట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ వెంకటరావు, మజ్జి శేఖర్, ఆవాల కృష్ణ, నేతేటి శివ, బషీర్,హాజరయ్యారు.లక్కవరపుకోట మండల కేంద్రంలోని మక్కామసీదులో రాష్ట్ర నూర్ సాహెబ్,దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కే.మథీన ప్రార్థనలు చేశారు. జామి మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు అంతా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గజపతినగరం మండలంలోని పురిటిపెంట సంతతోట కాలనీ మదీనా మసీదులో మత గురువు కలీమ్ రజా, ముస్లిం సంక్షేమ కార్యదర్శి ఎస్.ఎ. షరీఫ్ మాట్లాడుతూ మానవులంతా అల్లా దృష్టిలో సమానమేనని, ఇతర మతస్తులపై సోదరభావాన్ని కలిగి ఉండాలని ముస్లిం సోదరులకు సూచించారు. చీపురుపల్లి పట్టణంలోని పాతబస్టాండ్ ఆవరణలోని మసీదులో ప్రార్థనలు నిర్వహించారు.

– శృంగవరపుకోట, లక్కవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం,జామి



శృంగవరపుకోట: ఎస్.కోట ఈద్‌గాలో ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు



లక్కవరపుకోట: ఎల్.కోట మక్కా మసీదులో ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర నూర్ సాహెబ్,దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కె.మథీన, ముస్లింలు



జామి: జామిలో ర్యాలీ చేస్తున్న ముస్లిం సోదరులు



చీపురుపల్లి: చీపురుపల్లి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గజపతినగరం: శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ముస్లిం సోదరులు

బెవరపేటలో కొట్లాట

- ఇరువర్గాల్లో ఐదుగురికి తీవ్రగాయాలు
- మరో 12 మందికి స్వల్ప గాయాలు
- చికిత్స కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలింపు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మండలం పి.కె.పాలవలస పంచాయతీ పరిధి బెవరపేట గ్రామంలో శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పలువురికి తీవ్ర గాయాలు కాగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులకు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అందించారు. తీవ్రగాయాలైన వారిని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మూడు రోజుల కిందట గ్రామంలో 'జగనన్న నువ్వే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా బ్యాగులతో స్టిక్కర్లు అతికిస్తుండగా వలంటీర్, గ్రామపెద్దలను కొందరు యువకులు హేళనచేశారు. ఆ రోజే ఇరువర్గాల మధ్య గ్రామంలో వివాదం తలెత్తింది. ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. శనివారం ఉదయం రెండు వర్గాల మధ్య పోలీసుల సమక్షంలో పెద్దలు రాజీ కుదిర్చారు. అందరూ గ్రామానికి చేరుకున్నాక రాత్రి 8 గంటల సమయం దాటిన తరువాత మళ్లీ వివాదం చెలరేగింది. ఇది కొట్లాటకు దారితీసింది. ఇందులో ఒక వర్గానికి చెందిన మీసాల సూరిసత్యం, ముత్యాలమ్మ, రమేష్‌లకు తీవ్ర గాయాలు కాగా మీసాల రమేష్, కనకరాజు, చిన్నారావు, రమణ, గొర్లె ప్రకాష్, బాలకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. మరో వర్గానికి చెందిన మీసాల అప్పారావు, సాయికుమార్, గొల్లకృష్ణకు తీవ్రగాయాలు కాగా మీసాల అప్పలసత్యం, రామకృష్ణ, అన్నాజీరావు, సురేష్, గోవింద్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మీసాల గొల్లకృష్ణ, అప్పలసత్యం, సాయికుమార్‌లను సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు.



క్షతగాత్రులు మీసాల సూరిసత్యం, గొర్లె బాలకృష్ణ, మీసాల అప్పారావు, గొల్లకృష్ణ.

క్షతగాత్రులను పరామర్శించిన నాయకులు

గ్రామంలో శాంతిభద్రతలు అదుపులో ఉండేలా బందోబస్తు ఏర్పాటుచేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు డీఎస్పీకి ఫోన్‌లో సూచించారు. చీపురుపల్లి సీహెచ్‌సీ, జిల్లా సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులతో మాట్లాడి వైద్య సహాయ సహకారాలు అందించాలని కోరారు. మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

బాధితులకు అండగా నిలుస్తాం

- మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

చీపురుపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి చెప్పారు. పట్టణంలోని రుంకానవీధిలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నాలుగు కుటుంబాలను శనివారం ఆమె పరామర్శించారు. అనంతరం డాక్టర్ బొత్స సందీప్ నెలకొల్పిన ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు, దుస్తులు, కిరాణా సామగ్రి, వంట పాత్రలు, నిత్యా వసర సరుకుల పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు కొత్త ఇళ్లు నిర్మించుకునే సమయంలో ద్వారాలు, తలుపులు, కిటికీలు, విద్యుద్దీకరణ వంటి పనులను ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దన, వాకాడ శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, ధీర ఫౌండేషన్ ప్రతినిధి రేగుల వినోద్ పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి, తదితరులు

బీజేపీది ప్రజావ్యతిరేక పాలన

జామి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ము కాస్తూ, గ్యాస్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలను నిత్యం పెంచుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని నియోజకవర్గ సీపీఐ ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు ఆరోపించారు. మండల కేంద్రంలో 'మోదీని గద్దె దించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో శనివారం ప్రచార భేరీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద పాలన సాగిస్తున్న బీజేపీని సాగనంపుదామని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. సీపీఐ నాయకులు మద్ది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జామిలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బీమా పథకాలను వినియోగించుకోండి



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న బీఎం తిరుమలేశ్వరరావు

కొత్తవలస : ప్రభుత్వ బీమా ,పింఛన్ పథకాలను ఖాతాదారులు సద్వినియోగించుకోవాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ కొత్తవలస శాఖ మేనేజర్ జి.తిరుమలేశ్వరరావు అన్నారు. బ్యాంక్ సేవలు, బీమా సౌకర్యాలపై మండలంలోని దేవాడ గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్ష యోజన పథకం కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే, సదరు వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.2లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. జీవన జ్యోతి యోజన పథకం కింద ఏటా రూ.436 చెల్లిస్తే, సదరు వ్యక్తి సహజ మరణం పొందినా రూ.2లక్షల బీమా సొమ్ము అందజేస్తామన్నారు.అలాగే అటల్ పింఛన్ యోజనలో చేరి ప్రతీ నెల నిర్ణీత ప్రీమియం చెల్లిస్తే 60 సంవత్సరాల తర్వాత నెల నెలా పింఛన్ పొందవచ్చని వివరించారు. ఐఆర్‌ఐఎక్స్ డిపార్ట్‌మెంట్ చానల్ మేనేజర్ సీహెచ్.మాధవరావు, సీఎస్పీ కానూరి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

వేపాడ: స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో అయిదోతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హత పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. అయిదో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం10 గంటల నుంచి 12.30 గంటల వరకు,ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉంటుందన్నా రు. విద్యార్థుల పరీక్ష సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రంలో ఉండాలని సూచించారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బ్లూ లేదా బ్లాక్ ఇంక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తీసుకురావాలని, మాస్క్ ధరించాలని చెప్పారు.

ఊరటనిచ్చిన వర్షం



గజపతినగరంలో కురుస్తున్న వర్షం

శృంగవరపుకోట/ కొత్తవలస/బొండపల్లి/ దత్తిరాజేరు/ గజపతినగరం: కొద్ది రోజులుగా భానుడి ప్రకోపంతో అల్లాడుతున్న ప్రజానీకం శనివారం కురిసిన అకాలవర్షంతో చల్లబడ్డారు. ఈదురు గాలులు, ఉరుములతో ఎస్.కోట, కొత్తవలస, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరంమండలాల్లోని పలు ప్రాంతాల్లో సాయంత్రం మోస్తారు నుంచి భారీవర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది.

విజినిగిరిలో మెగా వైద్య శిబిరం



జామి: విజినిగిరిలో సేవలందిస్తున్న మిమ్స్ వైద్యులు



శృంగవరపుకోట: గిరిశిఖర గ్రామం రేగపుణ్యగిరిలో వైద్యసేవలందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్‌హ్యాండ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగావైద్య శిబిరం నిర్వహించారు.శిబిరానికి వచ్చిన గ్రామంతో పాటు చుట్టు పక్కగ్రామాలకు చెందిన 300 మందికి నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఎల్.ప్రశాంత్, వై.బాలఅంజలి, బి.భవానీ ప్రసాద్, వై.బాలాంజలి, బి.లితిక, సుమన్ వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కిలారి సూర్యారావు, హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు.

గిరిశిఖర గ్రామంలో...

శృంగవరపుకోట: మండలంలోని ఎస్.కోట మేజర్ పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం రేగపుణ్యగిరిలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.హారిక ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎంపీహెచ్‌ఏ శంకర్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ సుశీల, ఆశ వర్కర్ శ్రావణి, వలంటీర్ రాజు గిరిజనులకు వైద్య సేవలందించారు. 68మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులకు రక్తపూత పరీక్షలు చేసి మాత్రలు, సిరప్‌లు అందజేశారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

అన్ని వర్గాల అభివృద్ధికే పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదలు, మహిళలు,రైతుల పక్షపాతి అని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రేగ పంచాయతీ శివారు గ్రామాలు పెదిరెడ్లపాలెం, నీలకంఠాపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ కలిగిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలను నమోదు చేసుకుని, త్వరితగతిన పరిష్క రించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేక రులతో మాటాడుతూ నియోజకవర్గంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం 180 రోజులు పూర్తయిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంతో పాటు పథకాలు అందుతున్నాయా లేదా పర్యవేక్షించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను 70 శాతానికి పైగా పరిష్క రించామన్నారు. కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో త్వరలో 'స్పందన' ప్రోగ్రాం నిర్వహించి అప్పట్లో వచ్చిన ఫిర్యాదు ల్లో ఎన్ని పరిష్కారమయ్యాయి..? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై చర్చించి, పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ రావాడ నీలకంఠం, ఎంపీటీసీ బొడ్డు గణపతి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి యడ్ల కిశోర్, పార్టీ నాయకులు జగ్గన్నదొర, అవతారం తదితరులు పాల్గొన్నారు.



పెదిరెడ్లపాలెంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

'జగనన్నే మాభవిష్యత్' కార్యక్రమంపై సమీక్ష

బొండపల్లి: 'జగనన్నే మాభవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని గజపతినగరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శతశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జేసీఎస్ మండల కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. నియోజక వర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి,గంట్యాడ, జామి మండలాల జేసీఎస్ కన్వీనర్లతో విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని మండలాల వారీగా ఏయే గ్రామాల్లో శతశాతం పూర్తయింది, ఇంకా ఏయే గ్రామాల్లో ఎన్ని ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి అనుమతితో మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికించాలని సూచించారు. నియోజకవర్గంలో మరో రెండు రోజుల్లో కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేయాలని చెప్పారు. ఆయా మండలాల జేసీఎస్ కన్వీనర్లు కనకల సుబ్రహ్మణ్యం, మహదేవ ఫణీంద్రుడు, పల్లి రఘు, రామసూర్యం, సీర చందునాయుడు పాల్గొన్నారు.



జేసీఎస్ కన్వీనర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

ప్రజల నమ్మకం...జగన్



శృంగవరపుకోట: గోపాలపల్లిలో 'జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు



గుర్ల: పాలవలసలో పథకాలను వివరిస్తున్న నాయకులు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ శిరీష



గజపతినగరం: పురిటిపెంటలో పథకాలను వివరిస్తున్న సచివాలయ కన్వీనర్, గృహసారథులు



ఆర్) వేపాడ: సోంపురంలో పథకాలను వివరిస్తున్న నాయకులు

శృంగవరపుకోట: జగన్ అంటేనే నమ్మకమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు.మండలంలోని లపల్లి గ్రామంలో శనివారం ఉదయం 'జగనన్నే మాభవిష్యత్, మానమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు.గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్సీ పలు ఇళ్లకు వెళ్లి వారికి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ ఇచ్చిన ప్రశ్నావళిని అడిగి వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. తర్వాత ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మాన మ్మకం నువ్వేజగన్' స్టిక్కర్లను అతికించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు జగన్ పాలన కోరు కుంటున్నారని, నేడు రాష్ట్రం అంతటా ప్రతీ కుటుంబం ఆయన్ని తమలో ఒక్కరిగా విశ్వసిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలంతా గ్రహించారని అన్నా రు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంపీపీ ఎస్. సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎంపీటీసీ సన్యాసప్పడు, నాయకులు ఆర్.వెంకటగణేష్, తగరంపూడి రమణ, బుజ్జి, కె.వెంకటరావు, బి.వెంకటరావు, పోతయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి మంచి జరుగుతోందని, సంక్షేమసారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బూర్లె శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మండలంలోని పాలవలసలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. గృహసారథులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేశారు.

విశేష స్పందన

వేపాడ: మండలంలో శనివారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. సోంపురంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు,వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు శ్రీనివాసరావు, చామలాపల్లిలో సర్పంచ్ కోలా సతీష్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరించారు. అనంతరం ఇళ్లకు 'మానమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు.

జగనన్నేతోనే అభివృద్ధి

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. పట్టణంలోని దేవాంగులవీధిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు.

పాలనలో వ్యత్యాసం గుర్తించండి

గజపతినగరం: గత టీడీపీ ప్రభుత్వం పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని సచివాలయ కన్వీనర్ మంత్రి నరశింగరావు అన్నారు. పురిటిపెంట గ్రామంలో 'జగనన్న మాభవిష్యత్' వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులతో కలిసి శనివారం నిర్వహించారు. పథకాలపై ప్రజల అభిప్రాయం సేకరించి, ప్రజా మద్దతు పుస్తకాల్లో నమోదు చేశారు.